సాక్షి 24|7
శనివారం 31-3-2018
తూర్పుగోదావరి
Sat, 31 March 2018
epaper.sakshi.com//c/27488132

# సాంకేతిక వర్సిటీలకు దీటుగా జేఎన్‌టీయూకే

## విప్లవాత్మకమైన మార్పులకు వీసీ కుమార్ పునాది

బాలాజీచెరువు (కాకినాడసిటీ):

తాను బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి జేఎన్‌టీయూకేలో ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చామంటున్నారు యూనివర్సిటీ ఉపకులపతి వెల్లంకి సాంబశివరావు. జేఎన్‌టీయూకే మూడో ఉపకులపతిగా బాధ్యతలు చేపట్టి మూడేళ్లు పూర్తయ్యి మరో పదిహేను రోజుల్లో పదవీ కాలం పూర్తికానున్న సందర్భంగా ఆయన మూడేళ్లలో చేసిన అభివృద్ధిని 'సాక్షి'కి ఇలా వివరించారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే.. ''నా హయాంలో రెండుసార్లు 2015, 2018 స్నాతకోత్సవాలను నిర్వహించాను. జాతీయస్థాయిలో ఉపకులపతుల సమావేశం నిర్వహించి సాంకేతిక విద్యలో తీసుకురావాల్సిన విప్లవాత్మక మార్పులపై చర్చించాం. అధ్యాపకుల కొరతను అధిగమించేందుకు మ్యాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సులను జేఎన్‌టీయూకే, అనుబంధ కళాశాలల్లో దిగ్విజయంగా నిర్వహించి పరీక్షల నిర్వహణలో పారదర్శకతను పాటించేందుకు జంబ్లింగ్ విధానాన్ని ప్రవేశపెట్టాం. మహిళా కళాశాలలకు ఇందులో మినహాయింపునిచ్చాం. పరీక్ష కేంద్రాలైన కళాశాలలు 25 కిలోమీటర్ల పరిధిలో లేకపోతే వాటికి మినహాయింపును ఇచ్చాం. పీహెచ్‌డీ ప్రవేశాలను నిబంధనలకు అనుగుణంగా కఠినతరమైన విధివిధానాలతో సిఫారసులకు తావు లేకుండా అర్హత పొందిన అభ్యర్థులకే ప్రవేశాలు కల్పించాం. థీసిస్‌ను అతి గోప్యంగా పంపించి మూల్యాంకనం జరిపిస్తున్నాం. డైరెక్టరేట్ ఆఫ్ అకడమిక్స్ అండ్ ప్లానింగ్(డీఏపీ) వారు ఒక యాప్‌ను రూపొందించి అనుబంధ కళాశాలల అధ్యాపకుల వివరాలను, పాన్, ఆధార్ కార్డుతో సహా పొందుపరుస్తున్నారని, దీని వల్ల వారి వివరాలను వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తీసుకురాగలిగాం. ర్యాటిఫికేషన్‌ను పద్ధతి ప్రకారం నిర్వహించి అసిస్టెంట్ ప్రొఫెసర్లకు, అసోసియేట్ ప్రొఫెసర్లకు పదోన్నతులు కల్పిస్తున్నాం. తాజాగా ఈనెల 17న గుంటూరు జిల్లా కోటప్పకొండ సమీపంలో జేఎన్‌టీయూకే నరసారావుపేట కళాశాల నూతన భవనాలకు శంకుస్థాపన చేశారు. దీనికి ప్రభుత్వం 85.94 ఎకరాల స్థలం కేటాయించింది. వచ్చే జూన్, జూలైలోపు తృతీయ సంవత్సరం బీటెక్ విద్యార్థులను నూతన భవనాలలోకి తరలిస్తాం. కొత్తగా అగ్రికల్చర్ ఇంజినీరింగ్, టెక్స్‌టైల్ ఇంజనీరింగ్ కోర్సులను ప్రవేశపెట్టబోతున్నాం. జేఎన్‌టీయుకే దిగ్విజయంగా ఎంసెట్‌ను రెండుసార్లు ఆఫ్‌లైన్ పద్ధతిలో, ఒకసారి ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహించాం. ఈ ఏడాది కూడా ఎంసెట్ ప్రవేశపరీక్షను ఆన్‌లైన్ విధానంలోనే నిర్వహిస్తాం. అంతేగాక పోలీస్ రిక్రూట్‌మెంట్, ఎన్టీఆర్ విద్యోన్నతి, ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ జెన్‌కో తదతర పోటీపరీక్షలను నిర్వహించాం.

జేఎన్‌టీయుకేలో ప్రతి ప్రయోగశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నాం. ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు రెండు సబ్జెక్టులలో మాత్రమే విద్యార్థులకు ఏడు లేదా ఎనిమిది గ్రేస్ మార్కులను కేటాయిస్తున్నాం. విదేశీ విశ్వవిద్యాలయాలతో అనుసంధానమై నిర్వహిస్తున్న ఐఐఎండీపీ కోర్సుల స్ట్రక్చర్‌ను మార్చి (3+1+2) వారికి బీటెక్, ఎంటెక్ డిగ్రీలను ప్రదానం చేస్తున్నాం.''



జేఎన్‌టీయూకే వీసీ వీఎస్ఎస్‌కుమార్

సాక్షి
Sat, 31 March 2018
epaper.sakshi.com//c/27488654